# RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES

(A.P Government Act 18 of 2008)

## PUBLIC RELATIONS OFFICE

**Room No: 79, I-3, Administrative Block**

APIIIT- Nuzvid Campus, Krishna District, Andhra Pradesh-521202

Mail: pro@rguktn.ac.in, apro@rguktn.ac.in Mobile: 7382219873, 7989842715


Date: 28.04.2019

RGUKT, APIIIT, Nuzvid.

## ప్రెస్ నోట్

ఈ విద్యా సంవత్సరంలో విద్యాపరంగా ఉన్నత స్థాయి ఉద్యోగాలను పొంది, జాతీయ స్థాయి పరీక్షలలో మంచి ర్యాంకులను సాధించి, క్రీడలలోను, యోగా ప్రదర్శనలలోను అత్యున్నత స్థాయి ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ పేరు ప్రతిష్టలను మరింతగా ఇనుమడింపజేసిన విద్యార్థినీ విద్యార్థులకు ట్రిపుల్'ఐటీ, నూజివీడు ప్రాంగణంలోని SAC బిల్డింగ్ లో (నూతన ఆడిటోరియంలో) అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి. మరియు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన 90 మంది విద్యార్థినీ విద్యార్థులకు, జాతీయ స్థాయిలో బహుమతులను పొందిన 50 మంది యోగా విద్యార్థులకు, గేట్ వంటి ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సంపాదించిన 10 మంది విద్యార్థులకు, అత్యున్నత శ్రేణి ఉద్యోగాలను పొందిన కొంతమంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ట్రిపుల్'ఐటీల ఉపకులపతి ఆచార్య రామచంద్రరాజు గారు, ట్రిపుల్'ఐటీ నూజివీడు ఆచార్య డి.సూర్యచంద్రరావు గార్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య రామచంద్రరాజు గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదురెయ్యే ఒత్తిడులను అధిగమించడానికి క్రీడలు, మంచి సంగీతం పట్ల ఆసక్తి చూపడం మంచిదన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ వృత్తి పరమైన నైపుణ్యాలతో పాటుగా ప్రవృత్తిగా కొన్ని అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవలసిన అవసరం ఉంది. అలాంటి అదనపు నైపుణ్యాల్లో అత్యున్నత స్థాయి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులందరూ ఇదే విధానాన్ని కొనసాగించాలని కోరారు. 6500 విద్యార్థులున్న ఈ ప్రాంగణం నుంచి మరింత మంది విద్యార్థులు క్రీడలు, యోగా ప్రదర్శనలు, లలిత ప్రదర్శన కళల పట్ల కూడా ఆసక్తి చూపాలని అభిలషించారు.

ఈ సందర్భంగా ట్రిపుల్'ఐటీ నూజివీడు నిర్దేశకులయిన ఆచార్య డి.సూర్యచంద్రరావు గారు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా నూతనంగా ఏర్పాటు చేయబడిన ఆడిటోరియంలో మాట్లాడుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మీరంతా సరస్వతీ పుత్రులు మీ ప్రతిభని నిరూపించుకోవడానికి యోగా, సంగీతం, క్రీడలు ఒక అద్భుతమైన అవకాశం అని అన్నారు. వీటి ద్వారా విశ్వవిద్యాలయానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకురావచ్చు. ఉగాదికి యోగా విద్యార్థులచే భారత ఉపరాష్ట్రపతి శ్రీవెంకయ్య నాయుడు గారు ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఒక మరపురాని అనుభూతి అని, ఒక విదేశీ ప్రముఖులకి చేసే ఏర్పాట్లు, ఇచ్చిన మర్యాద మనకు ఇవ్వడం ఈ విశ్వవిద్యాలయానికే గర్వకారణమని అన్నారు. భారత పార్లమెంట్, రాష్ట్రపతి భవనం తమ బృందానికి ప్రత్యేకంగా చూపించారని, ఉప రాష్ట్రపతి గృహంలో తమకి ప్రత్యేక విందు ఏర్పాటు చేయడం అత్యున్నత గౌరవమని తెలిపారు. నూజివీడు ట్రిపుల్'ఐటి యోగా బృందం చేత సాంస్కృతిక మార్పిడి క్రింద విదేశాలకి పంపడానికి కూడా తగిన ఏర్పాట్లు వెంకయ్య నాయుడు గారి ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో విద్యార్థులను ప్రతిభావంతులుగా తయారు చేసిన యోగా శిక్షకుడు అక్కినేని సత్య శ్రీధర్, వ్యాయామ అధ్యాపకులైన సూర్య, నవీన్, సుబ్బలక్ష్మి,, ప్రదర్శన కళల విభాగ అధ్యాపకులను ఘనంగా అభినందించారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, అధ్యాపక అధ్యాపకేతర మిత్రులకు ధన్యవాదాలను, అలానే ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆశీస్సులను అందిస్తూ ట్రిపుల్'ఐటీ నూజివీడు పరిపాలనాధికారి సునీల్ భగత్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా తెలుగు విభాగ సహాయ ఆచార్యులు డా.జె.సీతాపతి రావు గారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధ్యక్షులు, డీన్లు, ఫైనాన్స్ ఆఫీసర్, పి.ఆర్.వో, తదితర అధికారులందరూ పాల్గొని ఉపకులపతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థినీ విద్యార్థులకు తమ శుభాకాంక్షలను తెలియజేశారు.